క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



వెంకటాచలం: మండలంలోని అనికేపల్లి గ్రామంలో ఇటీవల పాముకాటుకు గురై మృతిచెందిన కోసూరు అంకయ్యగౌడ్ కుటుంబానికి జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవా సమితి ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక సాయం అందించారు. అనికేపల్లిలోని కోసూరు అంకయ్య నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్, కార్యదర్శి సుబ్బయ్యగౌడ్, నడవడి ముత్యంగౌడ్, ఉప్పల రామకృష్ణగౌడ్, నిమ్మల వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండాలమ్మపాళెంలో 'ఫ్యామిలీ డాక్టర్'

కొడవలూరు: మండలంలోని గుండాలమ్మపాళెంలో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఓపీ నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గ్రామంలోని ఓ వ్యక్తి పక్షవాతం సమస్యతో బాధపడుతుండగా వారి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన ఓ మహిళకు కుష్టు లక్షణాలుండగా వారి ఇంటికి వెళ్లి పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారిని గీతా షాలిని, హెచ్ఎస్ ఎన్.సుజాత, ఎంఎల్‌హెచ్‌పీ రషీదా, హెచ్ఏలు షఫీ ఉద్దీన్, విజయలక్ష్మి, ఆశా కార్యకర్త శైలజ పాల్గొన్నారు.

మనుబోలు తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



శివకృష్ణయ్య

మనుబోలు : మండల తహసీల్దార్‌గా బొమ్మిశెట్టి శివకృష్ణయ్య సోమవారం మనుబోలులో బాధ్యతలు చేపట్టారు. ఆయన చేజర్ల తహసీల్దార్‌గా పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శివకృష్ణయ్య మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ రెవెన్యూ, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు.

నేడు 'జగనన్న సురక్ష' క్యాంపులు

కొడవలూరు: మండలంలోని గుండాలమ్మపాళెం, కొ దవలూరులో జగనన్న సురక్ష క్యాంపులు మంగళవార ం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో మంజూరైన సర్టిఫికెట్లను డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేస్తా మని తెలియజేశారు. ఆయా సచివాలయాల్లో ఉద యం 9 గంటలకు జరిగే కార్యక్రమాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డయాలసిస్ బాధితుడికి పింఛన్ మంజూరు



బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి నగర పంచాయతీలోని 20వ వార్డులో రామచంద్రాపురానికి చెందిన డయాలసిస్ బాధితుడు ఈగ మల్లికార్జున్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల పింఛన్‌ను మంజూరు చేసింది. ఈ నగదును స్థానిక కౌన్సిలర్ శ్రీదేవి సోమవారం అందజేసింది. దీంతో బాధితుడు మల్లికార్జున్ ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమంలో నేతలు పెంచలయ్య, వెంకటరమణారెడ్డి, కోటయ్య పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

పొదలకూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం సోమవారం జరిగింది. తహసీల్దార్ కె.వీరవసంతరావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మండలంలోని మొగళ్లూరు గ్రామానికి చెందిన ఎస్సీలు తాము సాగు చేసుకుంటున్న కొండ పోరంబోకు భూములకు పట్టాలు అందజేయాల్సిందిగా తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగులు, వంకలు, కొండలు, చెరువు పోరంబోకు భూములకు పట్టాలు ఇవ్వడం అసాధ్యమని, శివాయిజమా భూములు ఉంటే అందజేస్తామన్నారు. దీంతో పాటు పట్టాదారు పాసు పుస్తకాలు, ఇతర సమస్యలపై తహసీల్దార్‌కు వినతులను అందజేశారు.

ఉపాధ్యాయినులకు సత్కారం



మనుబోలు : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయినులు ఉషారాణి, పద్మజ, సువర్ణకుమారిలను సోమవారం పాఠశాల ఆవరణలో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం వసంతకుమారి, టీచర్లు ఉషాకుమారి, ఉషాదేవి, అలివేలి మంగమ్మ, శోభ, హసీనా, హల్లెలూయా, రుక్మిణి, ప్రయాంక, కృష్ణజ్యోతి, పీడీ ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి

• కిక్కిరిసిన సాయిబాబా ఆలయాలు

మనుబోలు : మండలంలోని పలు ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. మడమనూరు, వెంకన్నపాళెం, జట్లకొండూరు, మనుబోలు కోదండరామపురంలోని బాబా ఆలయాల్లో సాయినాథునికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అలాగే ఇతర ఆలయాల్లో కూడా పెద్ద ఎత్తున భక్తులు దేవాలయాలకు చేరుకుని విశేష పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం సాయినాథునికి పల్లకిసేవ గావించారు.

ఘనంగా..

పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే శిరిడీ సాయిబాబా మందిరంలో గురుపూర్ణిమ వేడుకలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తుల తాకిడి కొనసాగింది. ఉదయం 5.15 గంటలకు కాగడాహారతితో పూజలు ప్రారంభమయ్యాయి. 9.30కి సామూహిక సాయి సత్యవ్రత పూజలు, తీర్థప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్పనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



పొదలకూరు : సామూహిక సాయివ్రతం ఆచరిస్తున్న భక్తులు

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం దిన్నెలో ద్వారకామయి శిరిడీ సాయిబాబా మందిరంలో సోమవారం గురుపూర్ణిమ మహోత్సవం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి స్వామివారి పల్లకిసేవ కనులవిందుగా సాగింది. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పొదలకూరు : శ్రీరామానుజ జీయర్‌స్వామికి అభిషేకం

సాయినాథుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రగతి



సాయినాథుని దేవస్థానం వద్ద మంత్రి కాకాణి

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు : సాయినాథుని ఆశీస్సులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉండబట్టే ఆంధ్ర రాష్ట్రం ప్రగతి వైపు పయనిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురుపూర్ణిమను పురస్కరించుకుని మండలంలోని తాళ్లపూడిలో ఉన్న సాయిబాబా దేవస్థానంలో కుంభాభిషేకం కార్యక్రమానికి మంత్రి కాకాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి తండ్రి మెట్టా చంద్రశేఖర్‌రెడ్డికి సాయిబాబా అంటే ఎంతో భక్తిభావం ఉండేదన్నారు. ఆయన దేవస్థానంతో పాటు అనుసంధానంగా కల్యాణమండపాన్ని నిర్మించినట్లు తెలిపారు. పిల్లలకు సైతం సాయిబాబా పేర్లు పెట్టినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలకు తనను ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలతో పాటు, సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలకు సాయినాథుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నట్లు వెల్లడించారు. మంత్రి వెంట దేవస్థానం ధర్మకర్తలు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, తిక్కవరపు శివకుమార్‌రెడ్డి, గ్రామపెద్దలు, కార్యకర్తలు ఉన్నారు.

ఆటో వేలం రేపు

ఇందుకూరుపేట: మండలంలోని ఇందుకూరుపేట సెబ్‌స్టేషన్ పరిధిలో ఆటో బహిరంగ వేలం బుధవారం జరుగుతుందని సీఐ బాలకృష్ణ సోమవారం తెలిపారు. స్టేషన్ ఆవరణలో జరిగే వేలంపాటలో ఆసక్తిగల వారు పాల్గొని, ఆటోను దక్కించుకోవచ్చని తెలియజేశారు.

శాస్త్రోక్తంగా సుదర్శన యాగం

పొదలకూరు : పట్టణంలోని అయ్యప్పనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురుపూర్ణిమ సందర్భంగా సోమవారం సుదర్శన యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం కేసర్ల బాలాజీ స్వామి ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో దేవస్థానం చైర్మన్ బోయిళ్ల మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యాగంలో పాల్గొన్న భక్తులు

మన పథకాలు దేశానికే ఆదర్శం

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని జంగంధొరువు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రసన్న సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలు ఇంటి ముంగిటకే అందేలా సీఎం వైఎస్ జగన్ పాలన సాగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను తెలుపుకుని సంక్షేమ పథకాలు పొందవచ్చన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారుని ఖాతాలో నగదును జమ చేయడమే ఈ ప్రభుత్వ ప్రత్యేకత అని తెలిపారు. ప్రజల మనస్సుల్లో వైఎస్ జగన్ చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి, నాయకులు గురజాల బుజ్జిబాబు, షబ్బీర్, వాసు, చక్రి, సర్పంచ్‌లు ఈదూరు పద్మవతమ్మ, సుధీరమ్మ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

మహాలక్ష్మమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

మండలంలోని సోమరాజుపల్లి మజరా యాబీకండ్రిగలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్థానిక నేత దేవిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కొత్తూరు సాయిబాబా దేవస్థానంలో జరిగిన గురుపౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఇందుకూరుపేట: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని, అందుకు ప్రభుత్వం రుణ సహకారం అందిస్తోందని డీఆర్‌డీఏ ఏసీ(ఏరియా కోఆర్డినేటర్) శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఏపీఎం కార్యాలయంలో బ్యాంకర్లు, సీసీలు, వీఓఏలతో సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్ర ద్వారా అర్హత కలిగిన వారికి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోందన్నారు. ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పథకం(పీఎంఎఫ్ఎంఈ) యూనిట్లకు సంబంధించి ఎస్సీ, ఎస్టీలకు 35 శాతం సబ్సిడీ పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏసీ శ్రీనివాసులు

కార్యక్రమంలో ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, కొత్తూరు, జగదేవిపేట, గంగపట్నం గ్రామాల్లోని వివిధ శాఖలకు సంబంధించిన బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

• చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని 16వ వార్డులో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. ఈ మేరకు 16వ వార్డులో విద్యుత్ మోటార్‌ను ఆమె సోమవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఇక్కడ గత కొంత కాలంగా తాగునీటి సమస్య ఉందని, దీనివల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కౌన్సిలర్ ప్రమీలమ్మ తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. దీనిని కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే 15వ ఆర్థిక సంఘం నిధులను మంజూరు చేసి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రమీలమ్మ, సత్యనారాయణ, సచివాలయ కార్యదర్శి కృపాకర్, స్థానికులు పాల్గొన్నారు.



విద్యుత్ మోటార్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుప్రజ

'జగనన్న సురక్ష' పక్కాగా జరగాలి



పొదలకూరు : సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ



కోవూరు : మాట్లాడుతున్న మండల సచివాలయాల కన్వీనర్ ప్రసాద్

• తహసీల్దార్ వీరవసంతరావు

పొదలకూరు : మండల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని తహసీల్దార్ కె.వీరవసంతరావు పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎంపీడీఓ టి.నగేష్‌కుమారితో కలిసి సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అపరేటర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈనెల 1వ తేదీన బిరదవోలు, డేగపూడి సచివాలయాల్లో సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసి 11 రకాల సర్టిఫికెట్లను మంత్రి, కలెక్టర్ చేతులమీదుగా అందించినట్లు తెలిపారు. మిగిలిన సచివాలయాల్లో గందరగోళ పరిస్థితి నెలకొనకుండా బిరదవోలులో సర్టిఫికెట్లను అందజేసిన డీఏలు వారి అనుభవాన్ని మిగిలిన డీఏలకు వివరించాల్సిందిగా సూచించారు. అర్హులైన ఏ ఒక్కరూ మిగిలిపోకుండా ముందుగా వెరిఫికేషన్ పూర్తి చేసి తర్వాత క్యాంపు ద్వారా సర్టిఫికెట్లు అందజేయాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శివమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ మేలు

కోవూరు : 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రతిఒక్కరికీ మేలు జరుగుతుందని మండల సచివాలయాల కన్వీనర్ కవరగిరి ప్రసాద్ అన్నారు. కోవూరు మండల కేంద్రంలోని 3, 4 గ్రామ సచివాలయాల్లో 'జగనన్న సురక్ష'పై అవగాహన కార్యక్రమం సోమవారం జరిగింది. ఇందులో ఆయన పాల్గొని, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్లు పుచ్చలపల్లి వెంకటరమణారెడ్డి, వెంకటేశ్వరరావు, మావులూరి వెంకటరమణారెడ్డి, వేమారెడ్డి శివకుమార్‌రెడ్డి, మసూద్ తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో అవగాహన ర్యాలీ

సద్వినియోగం చేసుకోండి

బుచ్చిరెడ్డిపాళెం: 'జగనన్న సురక్ష'ను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీలోని ఐదో సచివాలయ కార్యదర్శి కృపాకర్ అన్నారు. ఈ మేరకు పట్టణంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదో సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం జరుగుతుందని, ఇందులో 11 రకాల సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన నాలుగో సెమిస్టర్ పరీక్షకు 4,450 మందికి గానూ 3,980 హాజరయ్యారు. నెల్లూరు నగరంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు, కావలిలోని ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఒకరు డిబారయ్యారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన ఆరో సెమిస్టర్ పరీక్షకు 65 మందికి గానూ 58 మంది హాజరయ్యారు. కావలిలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో ఒకరిని డిబార్ చేసినట్లు వెల్లడించారు.

16న గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

వెంకటాచలం: నెల్లూరు నగరంలోని టౌన్‌హాలులో ఈనెల 16వ తేదీన జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవా సమితి ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తారని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కోసూరు సుబ్బయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ కోసూరు పద్మగౌడ్ సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో 450 పైగా మార్కులు సాధించిన గౌడ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తారని తెలియజేశారు.

బైక్‌ను ఢీకొన్న కారు

• వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటారు బైక్‌ను కారు ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని చెముడుగుంట సమీపంలో సోమవారం జరిగింది. కనుపూరు గ్రామానికి చెందిన శీనయ్య బైక్‌పై నెల్లూరు నుంచి కనుపూరుకు వస్తుండగా చెముడుగుంట వద్ద జాతీయ రహదారిపై ఓ కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శీనయ్యకు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పోతిరెడ్డిపాళేనికి ఎమ్మెల్యే ప్రసన్న రాక

కోవూరు : మండలంలోని పోతిరెడ్డిపాళెం గ్రామంలో మంగళవారం జరుగనున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

ముత్తుకూరు : రైతులు విధిగా పీఎం కిసాన్-ఈకేవైసీ చేయించుకోవాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ సూచించారు. ముత్తుకూరులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణా కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాలుగా కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు రైతులకు అందాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అలాగే రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట విత్తనాలను విధిగా పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ రాజ్‌కుమార్

భవన నిర్మాణాలను పూర్తి చేయాలి

ఇందుకూరుపేట : గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని పీఆర్‌ఈఈ బాలసుబ్బారావు సూచించారు. మండలంలోని కొత్తూరులో నిర్మిస్తున్న భవనాలను అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా వీటిని నూరు శాతం పూర్తి చేయాలని కోరారు. ఆయన వెంట డీఈ గౌతమ్, ఏఈ ఖాదర్ మస్తాన్, స్థానిక వైఎస్సార్‌సీపీ నేత కైలాసం శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.



కొత్తూరులో సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఈఈ

డిజిటల్ విద్య ఎంతో ప్రయోజనకరం

• ఎంఈఓ వసంతకుమారి

కొడవలూరు: విద్యార్థులకు డిజిటల్ విద్య ఎంతో ప్రయోజనకరమని ఎంఈఓ జి.వసంతకుమారి తెలిపారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఆత్మకూరు, సంగం మండలాల్లోని 160 మంది ఉపాధ్యాయులకు డిజిటల్ ఎడ్యుకేషన్‌పై శిక్షణా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డు(ఐఎఫ్‌పీబీ)లు రానున్నాయన్నారు. వీటి ద్వారా విద్యార్థులకు మెరుగైన బోధన అందించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. వీటిపై జిల్లాలోని ఉపాధ్యాయులందరికీ ఈనెల 15వ తేదీ వరకు శిక్షణ ఇస్తామన్నారు. ఒక్కో బ్యాచ్‌కు రెండ్రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. జిల్లాలో రెండు వేల మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కంప్యూటర్ విభాగాధిపతులు ప్రవీణ్‌కుమార్, కేవీ నాగేంద్ర, ప్రఫుల్‌కుమార్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంఓ జి.సుధీర్‌బాబు, కళాశాల ప్రిన్సిపల్ పి.కుమార్‌బాబు, నార్తురాజుపాళెం హైస్కూల్ హెచ్ఎం డి.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ

చెంచురామిరెడ్డి మరణం తీరనిలోటు

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : సచివాలయ కన్వీనర్ రుండ్ల చెంచురామిరెడ్డి అకాల మరణం తీరనిలోటని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన చెంచురామిరెడ్డి(38) వారం క్రితం మృతిచెందారు. ఈ క్రమంలో మంత్రి కాకాణి సోమవారం తాటిపర్తి గ్రామానికి వెళ్లి మృతుడి తండ్రి సుబ్బరామిరెడ్డిని పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ చెంచురామిరెడ్డి మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని, వారి కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటానన్నారు. మంత్రి వెంట ఉప సర్పంచ్ పాపమూరు లచ్చారెడ్డి, పలుకూరు పోలిరెడ్డి, సీహెచ్ శ్రీహరి, డి.శ్రీనివాసులురెడ్డి, డి.మురళీకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.



కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి కాకాణి